శనివారం రాత్రి సుల్తాన్‌పల్లిలో గస్తీ కాస్తున్న యువకులు

దోపిడీల నివారణకు రంగంలోకి యువత

శంషాబాద్ రూరల్, జూన్ 16: శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లిలో ఇటీవల కొంతమంది అభరణాలతో పాటు సెల్‌ఫోన్లు దోచుకుపోయారు. అయితే దోపిడీల నివారణ కోసం శంషాబాద్ రూరల్ పోలీసులు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దీంతో గ్రామంలో యువకులు శనివారం అర్ధరాత్రి గ్రామ శివారులోని సీసీకెమెరాలు పరిశీలించారు. అందులో ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి కనిపించడంతో గ్రామంలోని యువత 2 గంటల పాటు గస్తీచేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలిపారు. గ్రామస్తులను కాపాడుకోవడం కోసం యువత సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

స్వచ్ఛందంగా రక్తదానం

బన్సీలాల్‌పేట్, జూన్ 16: తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం గాంధీనగర్ కాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం స్వచ్ఛందంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. గాంధీనగర్ కాలనీ అసోసియేషన్, సికింద్రాబాద్ సహకారంతో టీమ్ పారస్ సేవ, డయాగ్నోస్టిక్ లీడర్స్, మేవాడ్ నవయువక్ మండల్, ఏవీకే మిత్ర బృందం, హెల్దీ లైఫ్ మై బర్త్ రైట్, జేసీఐ హైద్రాబాద్ రాయల్‌ల సంయు క్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో చేసిన 200 యూనిట్ల రక్తాన్ని తలసీమియా సికిల్ సెల్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వారికి అందజేశారు. అనంతరం రక్త దాతలకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో ముఖ్య నిర్వాహకులు రోహిత్, సతీశ్, నితిన్, జగదీశ్ కుమార్, ప్రకాశ్, వలంటీర్లు, గాంధీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ రమణ, ప్రధాన కార్యదర్శి పి.రవికాంత్, కోశాధికారి మోహన్‌రావులు పాల్గొన్నారు.

చాకిరి బారెడు.. వేతనం మూరెడు

డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు (ఫైల్)

ఆశాలకు అన్నీ కష్టాలే..

- సమయానికి రాని వేతనాలు
- అదనపు విధులకు అందని చెల్లింపులు

పనికి తగిన ప్రతిఫలం అందించాలి..

ఆశాలతో అదనపు విధుల్లో చాకిరీ చేయించి.. ఇప్పటివరకు ఎలాంటి చెల్లింపులు లేకపోగా దీర్ఘకాలంగా పీఆర్‌సీ దక్కడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. కొన్నేండ్లుగా లెప్రసీ సర్వే, ఇటీవల నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం వంటి అదనపు విధులకు ఎలాంటి చెల్లింపులు జరగలేదని వాపోతున్నారు. మరోవైపు ప్రతినిత్యం సర్వేలంటూ రోడ్లమీద ఉండే ఆశా వర్కర్లకు చివరికి ఉద్యోగ భద్రత కూడా కరువయ్యే పరిస్థితి నెలకొంది. ఇంతకాలం పనిచేసినా ఆశా వర్కర్లను క్రమబద్ధీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్ష పెడతామనడం వారి భవితవ్యానికి పెద్ద పరీక్షగా మారిపోయింది. ఈ విషయమై శ్రీరాంనగర్, అమీర్‌పేట్ క్లస్టర్లలో పనిచేస్తున్న వందలాది మంది ఆశా వర్కర్లు తమ బాగోగులు పట్టించుకునే వారు లేరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం పనికి తగ్గ ప్రతిఫలం అందించి తగిన న్యాయం చేయాలని ఆశా వర్కర్లు కోరుతున్నారు.

జూబ్లీహిల్స్, జూన్ 16: ఆశా వర్కర్లను అన్నీ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రజల ఆరోగ్య సంరక్షణకు అహర్నిషలు కృషి చేస్తున్న ఆశా వర్కర్లకు సమయానుకూలంగా వేతనాలు అందక ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎండనకా వాననకా కష్టపడుతున్న ఆశాల పరిస్థితి చాకిరీ బారెడు.. వేతనం మూరెడు.. అన్న చందంగా మారిపోయింది. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ సర్వేలు, ఆరోగ్య శిబిరాలు, ప్రభుత్వ వైద్య కార్యక్రమాల నిర్వహణకు ముందుండే ఆశాల కష్టానికి తగిన ప్రతిఫలం లేక నిరాశ నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారు.

డిసెంబర్ వేతనం ఇప్పటికీ పెండింగ్‌లోనే..

గత డిసెంబర్ వేతనం ఇప్పటికీ పెండింగ్‌లో ఉండగా జూన్ గడిచిపోతున్నా వారికి నేటికీ జీతాలు రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఎన్నికలకు ముందు ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఈనెల 12న జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా కొవిడ్ సర్వేతో పాటు రోగులను తరలిస్తూ విధి నిర్వహణలో పాల్గొన్న ఆశా వర్కర్లను తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున సత్కరించింది. ప్రతిరోజు విలేజ్ సర్వే, ఎన్‌సీడీ సర్వే, తల్లిపాల వారోత్సవాలు, పల్స్ పోలియో, ఎన్‌డీడీ కార్యక్రమంతో పాటు గర్భిణులను 6 వారాల నుంచి ప్రసవం పూర్తయ్యే వరకూ కంటికి రెప్పలా కాపాడటంలో వారి పాత్ర కీలకం. నవజాత శిశువులకు ఐదేండ్లు వచ్చే వరకు ఇమ్యునైజేషన్ కార్యక్రమాల నిర్వహణతో కంటిమీద కునుకు లేకుండా పనిచేస్తున్న ఆశాలకు పనికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు.

విధుల్లో ఆశా వర్కర్లు (ఫైల్)

బండ్లగూడలో నిర్వహించిన కురుమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేశ్

కురుమల బలోపేతానికి కృషి చేయాలి

బండ్లగూడ, జూన్ 16: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కురుమలందరూ ఏకం కావాలని కార్పొరేషన్ అధ్యక్షుడు తాండ్ర రమేశ్ కురుమ పేర్కొన్నారు. ఆదివారం సంధ్యానగర్‌కాలనీలో కురుమ సంఘం సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులందరూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న కురుమ కులస్తులందరిని ఏకతాటిపైకి తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ కురుమ, ఉపాధ్యక్షుడు మల్లేశ్ కురుమ, కార్యదర్శి బి.బాబురావు కురుమ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్యనారాయణ కురుమ, సభ్యులు జగదీష్‌కురుమ, కృష్ణయ్య కురుమ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ ట్రస్ట్ చేయూత

స్పీకర్ చేతుల మీదుగా చెక్కులు అందుకున్న విద్యార్థులు

ఖైరతాబాద్, జూన్ 16: పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. లక్డీకాపూల్‌లోని ఎస్ఎస్ సెంట్రల్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, శిరీషరెడ్డి చేతుల మీదుగా 300 మంది విద్యార్థులకు సహాయత చెక్కులను అందజేశారు. శివారెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా 10వ తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చి పై చదువులు చదువుకోలేని విద్యార్థులకు సహాయం అందిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది 500 నుంచి వెయ్యి మంది విద్యార్థులకు రూ.10వేల సాయాన్ని అందజేస్తున్నామన్నారు. నలుగురికి సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ కపుల్స్

ఖాజాగూడ ప్రభుత్వ పాఠశాలలో నీటి ట్యాంకులను ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

మణికొండ, జూన్ 16: నిరుపేదలను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మణికొండ వాసవి క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు వంగవీటి వంశీకృష్ణ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ఆదేశాల మేరకు ఖాజాగూడ ప్రభుత్వ పాఠశాలలో వెయ్యి లీటర్ల నీళ్ల ట్యాంకు, 20 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. కానిస్టేబుల్స్‌కు మాస్కులు, టవల్స్, స్టీట్ వెండర్స్‌కు గొడుగులు, ఆరుగురి చేత ఆర్గాన్ డోనర్ చేయించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ ఈసీ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో తమవంతు సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి తల్లాడ యశ్వంత్, కోశాధికారి శిరీష, జోన్ చైర్మన్ కలగార్ల నిరీష, రీజియన్ చైర్మన్ గంగిశెట్టి నవీన్‌కుమార్, రీజియన్ సెక్రటరీ రాంసురేశ్, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిమ్స్ దవాఖానలో ఆదివారం హీమో డయాలసిస్‌పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప సదస్సును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శాంతివీర్, నెఫ్రాలజీ హెచ్‌వోడీ ప్రొఫెసర్ స్వర్ణలత, ప్రొఫెసర్ శ్రీభూషణ్‌రాజు, ప్రొఫెసర్ టి.గంగాధర్, డాక్టర్ రాజాకార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్

నాన్ టీచింగ్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న యూసుఫ్

హిమాయత్‌నగర్, జూన్ 16: రాష్ట్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఉద్యోగుల రాష్ట్ర సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ మైనార్టీ రెసిడెన్షియల్‌తో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో సుమారు 12వేల మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయడంతో పాటు హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. బకాయి ఉన్న 12 నెలల వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కరుణకుమారి, సమ్మయ్య, సయ్యద్ జహంగీర్, నవీన్, ఆంతోష్, ఫిరోజ్, రేణుక పాల్గొన్నారు.

కుమ్మరి కులస్తుల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు

శంషాబాద్ రూరల్, జూన్ 16: కుమ్మరి కులస్తుల అభివృద్ధి కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జయంత్‌రావు మాట్లాడుతూ కుమ్మరుల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. శంషాబాద్ మండల కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా కొన్నమొల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అర్జున్, ఉపాధ్యాక్షుడిగా మహేశ్‌బాబు, యూత్ అధ్యక్షుడిగా శ్రీకాంత్, మున్సిపల్ అధ్యక్షుడిగా కుమ్మరి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా బి.కుమార్, సలహాదారుడిగా దేవేందర్‌లతో పాటు పలువురుతో కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఆనంద్, స్థానిక కౌన్సిలర్ కొన్నమొల్ల భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బండికి శుభాకాంక్షలు

శుభాకాంక్షలు తెలుపున్న కార్పొరేషన్ బీజేపీ నాయకులు

బండ్లగూడ, జూన్ 16: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్‌కి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు గోకుల్, మహేశ్ యాదవ్, బండి నరేశ్‌యాదవ్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే రాజాసింగ్ అరెస్టు

శంషాబాద్ రూరల్, జూన్ 16: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఆర్‌జీఐఏ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసినట్లు సీఐ బాలరాజు తెలిపారు. మెదక్‌లో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే రాజాసింగ్ మెదక్ వెళ్తానని ప్రకటించారు. నేపథ్యంలో ముంబై నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఎమ్మెల్యేను అరెస్టు చేశామని వివరించారు.

పుస్తకాల ఆవిష్కరణ..

చిక్కడపల్లి: విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ జెల్దీ విద్యాధర్ రచించిన 'అంతరంగపు భాష', 'తోటమాలి మాలిమి' ఆంగ్ల అనువాద పుస్తకాలు 'వాయిస్ ఆఫ్ సౌల్', 'ద గార్డెన్స్ లవ్' పుస్తకాల ఆవిష్కరణ ఆర్ట్‌సీ క్రాస్ రోడ్స్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు.

దివ్యాంగులను ఆదుకునేందుకు కృషి

నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృతిమ పరికరాల పంపిణీ

దివ్యాంగురాలికి పరికరం అమర్చుతున్న సంస్థ ప్రతినిధులు

ఈడెన్ గార్డెన్‌లో దివ్యాంగులకు పరికరం అమర్చుతున్న ఎంపీ కొండా

హిమాయత్‌నగర్, జూన్16: రాష్ట్రంలోని దివ్యాంగులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తూ వారికి అండగా నిలుస్తుందని ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి, బీజేపీ నాయకురాలు మాధవిలత తెలిపారు. ఉదయ్‌పూర్‌లోని నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్‌లో ఉచితంగా దివ్యాంగులకు కృతిమ అవయవాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు, అనారోగ్యం వల్ల వికలాంగులుగా మారిన వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సంస్థ ఉచితంగా కృతిమ అవయవాలను అందిస్తున్నదని తెలిపారు. సమాజ సేవ చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సంస్థలకు కేంద్ర ప్రభుత్వం తరపున ప్రోత్సహించడంతో పాటు సహాయ, సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థాన్ డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా, కోఆర్డినేటర్ అల్కాచౌదరి, ప్రతినిధులు జస్మిత్ పటేల్, భగవాన్ ప్రసాద్‌గౌర్, రితేష్ జగీర్ధార్, ప్రశాంత్ అగర్వాల్, నరేంద్రసింగ్ చౌహాన్, ఉత్తమ్ దమ్రాణి అభయ్‌చౌదరి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారం మార్పుతో మధుమేహం నియంత్రణ

మధుమేహ నియంత్రణ సమావేశంలో పాల్గొన్న యాదుకృష్ణ

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16: మధుమేహం(డయాబెటిస్) అనేది రోగం కాదని.. జీవక్రియ(మెటబాలిక్ డిజార్డర్)లో లోపమని.. ప్రతి రోజు యోగా సాధన, ఆహారం, దినచర్యలో మార్పులు చేసుకుని మనుస్సును ప్రశాంతంగా ఉంచుకుంటే మధుమేహాన్ని నియంత్రించవచ్చని తెలంగాణ స్టేట్‌వెస్ట్ అధ్యక్షుడు యాదుకృష్ణ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల ఉచిత మధుమేహ నియంత్రణ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ..మధుమేహం అనేది వయస్సుతో సంబం ధం లేదని, పలు కారణాలతో అన్ని వయస్సులవారు దానిబారిన పడుతున్నారన్నారు. మధుమేహం వచ్చిందని బాధపడోద్దని, అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యోగా సాధన, ఆటలు, శారీరక శ్రమ, చక్కటి ఆహారం, నిద్ర, ఒత్తిడి లేని జీవితాన్ని గడిపితే మధుమేహం నియంత్రణలో ఉంటుందని, తద్వార జీవితాన్ని ఆనందంగా హాయిగా ఆస్వాదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు, జోనల్ అధ్యక్షుడు రమేశ్‌బాబు, అంజిబాబు, సెంట్రల్ ఇన్‌చార్జి శిరీష, శవిదేవి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేత

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 16: ప్రస్తుత యాంత్రిక జీవనంలో యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేశ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి బాబుల్ రెడ్డినగర్‌లోని శ్రీరామకృష్ణ యోగా ట్రస్ట్ నిర్వాహకులు జస్పాల్‌సింగ్ డాక్టర్ పోతన్న సమక్షంలో ఆదివారం యోగా పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజు ఒక గంట పాటు యోగా చేస్తే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళ ఉచితంగా యోగా శిక్షణ అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు మూల్చంద్ జి శర్మ, అనూష, అజిత్ సింగ్, అరవింద్, వెంకటేశ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

అధికారులతో కలిసి కవర్లను పంపిణీ చేస్తున్న వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్, జూన్ 16: ముస్లిం సోదరులు జరుపుకునే పవిత్ర పండుగ బక్రీద్ త్యాగానికి ప్రతీక అని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యవిజయ్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్‌లోని చోటీ మసీదు, పెద్ద మసీదు, జీటీఎస్ మసీదుల వద్ద ముస్లిం సోదరులకు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బ్లాక్ కవర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు సదర్లు మన్నాన్, అబ్దుల్లా, సమద్, నాయకులు మెహబూబ్, అంజయ్య యాదవ్, దేవిసింగ్, జహంగీర్ పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

హిమాయత్‌నగర్: బక్రీద్ పండుగ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి కోరారు. ఆదివారం కింగ్‌కోఠి, రాంకోఠి, షేర్‌ఘాట్, హిమాయత్‌నగర్‌లో ప్లాస్టిక్ కవర్లను ముస్లిం సోదరులకు ఆమె అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జి.రామన్‌గౌడ్, మహేశ్, మన్సూర్, పూర్ణచందర్, నదీం, సోయల్‌జాబ్రీ, ఎస్ఎఫ్ఏ మధు పాల్గొన్నారు.

కింగ్‌కోఠిలో ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

వ్యర్థాలు బయటపడేయొద్దు

జూబ్లీహిల్స్, జూన్ 16: స్వచ్ఛ నగరంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సూచించారు. ఆదివారం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజారుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లింలకు బక్రీద్ కవర్లు పంపిణీ చేశారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా జీవ వ్యర్థాలు బయటపడేయకుండా కవర్లోనే వేయాలని సూచించారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

కొండాపూర్, జూన్ 16: వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో ఢిల్లీకి చెందిన నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు నాగజ్యోతి, సీతా నాగజ్యోతిల శిష్యబృందం 'కూచిపూడి దర్పణం' నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో స్వరజతి, వాణికి వందనం, దశావతారం, ఔరశబ్దం, తులసీదాస్ కీర్త న, కొలువైతివా, బృందావన సాగరం ధిల్లాన అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు.